# "ఎంకి"

శ్రీ పైడి వెంకట్రావు

......మెట్లమీద బూట్లు చప్పుడయింది. గోడకు జారగిల్లి కునికిపాట్లు పడుతున్న 'గేట్ మేన్' వులిక్కిపడి లేచాడు తలగుడ్డ సర్దుకొంటూ. ప్రసాద్ యకాయెకి వార్డన్ ఆఫీసుగదిలోకి పోయాడు. వార్డన్ అనుమతిపొంది మేడ మెట్లెక్కాడు.

ఆ గదిలోకి తొంగిచూసాడు. టేబిల్ మీద ఫోటోస్టాండులో ప్రసాద్ ఫోటో నిలబెట్టబడివుంది. అరవింద అమాయకత్వానికి ప్రసాద్ తనలో తాను పరిహాసంగా నవ్వుకొన్నాడు. మేడ మెట్లమీద స్లిప్పర్ల చప్పుడు వినుపించింది. ప్రసాద్ మెట్లవైపు తిరిగాడు. అరవింద, శశీ, కాంతం, పకపక నవ్వుకొంటూ మెట్లెక్కుతున్నారు. అరవింద ప్రసాద్‌ను చూచి నివ్వెరపోయింది. శశీ కాంతం ముసిముసినవ్వులతో గుసగుసలాడుకొంటూ ప్రక్కకు తప్పుకొన్నారు.

ముడిచి గోడకు యెత్తబడిన కుర్చీనివిప్పి, ప్రసాద్‌ను కూర్చోమని సౌజ్ఞచేసింది అరవింద.

ప్రసాద్ కుర్చీలో కూర్చుని జేబురుమాలితో ముఖం తుడుచుకొంటూ అన్నాడు–"మీవార్డను అనుమతిపొందాను మనం యిద్దరం బీచివడ్డుకు చల్లగాలికి పోదాం, తయారుకా–"

ఫ్లాస్కులోని కాఫీని కప్‌లోకి పోస్తున్న అరవింద ఆశ్చర్యంగా అంది– "నన్నూ...లోకవిరుద్ధం కాదూ?..."

ప్రసాద్:–"కొన్ని కోట్లసార్లు చెప్పాను–లోకానికి వెరచి సౌఖ్యాన్ని అరికట్టుకోవడం కేవలం బుద్ధిహీనత్వాన్ని వెల్లడి చేస్తుందని–"

అరవింద ఏదో సమాధానం చెప్పబోయి ఆగింది. ప్రసాద్ లేచి వరండాలో పచారీచేస్తున్నాడు.

చక్కగా తల తీర్చిదువ్వుకొని, నొసటను అందంగా బొట్టుదిద్ది, తెల్లటిదుస్తులతో చాల కొద్దిలోనే అనుకూలమైన నాజూగ్గా తయారయింది అరవింద.

గుండ్రటిముఖంలో తీర్చిదిద్దిన కనుబొమ్మల మధ్య చురుదనాన్ని వెదజల్లుతున్న కళ్ళూ, దొండపండ్లవంటి పెదాలు, ఆపిల్ పండ్లవంటి బుగ్గలు, ఆకర్షవంతగావుంది అరవింద.

కబుర్లు చెప్పుకొంటూ యిద్దరూ బీచికి పోతున్నారు. అంత చనువుగా పురుషులతో కలసి మెలసి తిరుగుట అలవాటు లేక అరవింద సిగ్గుతో పైటకొంగును వంటినిండా కప్పుకొని ప్రసాద్ వెనకనే నడుస్తోంది.

బీచి వొడ్డున జనసమూహం తక్కువగానున్న దూరపు యిసుకతిన్నె మీదగా వెళ్ళి సముద్రానికి దగ్గరగా కూర్చున్నారు అరవిందా ప్రసాదులు. సముద్ర కెరటాలు ఆ యిసుక తిన్నెతో చేతులు చరుస్తున్నాయి. కృంగిపోతున్న సూర్యకిరణాలు కెరటాలు మీద బంగారాన్ని కరిగిస్తున్నాయి. నీటిపక్షులు చిత్ర విచిత్రాలైన పల్టీలు కొట్టుచున్నాయి. పిల్ల తెమ్మెరలు ప్రక్కనున్న సరువుడు తోటలో కూనిరాగాలు తీస్తున్నాయి.

కెరటాలమిదికి దృష్టినిదొర్లిస్తూ ప్రసాద్ అన్నాడు–

"అరవిందా, చూడూ ప్రకృతి, ప్రేమమూర్తుల్ని మోహన రాగాలలో జోకట్టుంటే..."

అరవింద అంది–"క్రూరసంఘం కులకట్లతో బిగింపులు బిగిస్తూ వుంటే!"

ప్రసాద్ హెచ్చరిగ్గా అన్నాడు–"పిచ్చిదానా! స్వేచ్ఛాజీవుల్ని, నిశ్చల ప్రేమమూర్తుల్ని, సంఘం కాదుగదా దేవుడుకూడా

వేరు చేయటానికి వెరుస్తాడు. భగవంతుని సృష్టి, ప్రకృతి, కూడ ప్రేమమూర్తుల కలయికకే మిక్కిలి ఆనందిస్తాయి"

అరవింద సహజంగా సమాధానం యిచ్చింది-

"ప్రేమమయుడగు భగవంతుడు ప్రేమమూర్తుల్ని వేరు చేయటానికి వెరువవచ్చును కాని, క్రూరసంఘాని కెక్కడిదిదయ!"

ప్రసాద్:-"నీకెప్పుడూ సంఘాన్ని తిట్టిపోయడమే పని- నీ ఆత్మకు శాంతి......"

అరవింద దీనంగా అంది-"చింతాసముద్రం యినికిపోయిన యీ హృదయానికి యింకెక్కడిశాంతి! శాశ్వతశాంతే దిక్కు. యీ పాపిష్టి సంఘంలో నిర్మల ప్రేమకు తావెక్కడిది? పిచ్చి-ఎక్కడి ప్రేమ! దొంగతనంగా సంచరించవలసిందే కాని నిర్భయ జీవితానికి వప్పుకోదు. యీక్రూర సంఘానికి నావంటి స్వాతంత్ర్య ప్రేమ హృదయాలెన్ని బలిఅవుతున్నాయో గదా!..."

చెమ్మగిల్లిన అరవింద నేత్రాలవంక పేలవగా చూస్తూ అన్నాడు ప్రసాద్-"అవును కాని అరవిందా! నిన్ను లూథర్‌కు యిచ్చిపెండ్లిచేస్తానని మీనాన్నగారు వుత్తరాలు వ్రాస్తున్నారు కాదూ?"

అరవింద ఆమాట వినగానే వులిక్కిపడింది. కళ్లుతుడుచుకొని ప్రసాద్ కళ్లలోకి దీనంగా చూచింది. హృదయాన్ని మైనంమాదిరి కరిగించే ఆ చూపుల్లో హృదయవేదన పొరలిపోతోంది.

ప్రసాద్ తిరిగి అన్నాడు-"అయితే నీకు మతం తీసుకోవడం యిష్టమేనా?

అరవింద-"నా ప్రేమకు మతాలు అడ్డువస్తాయా? నిజంగా నాహృదయం అతన్నే ప్రేమించివుంటే యిప్పటికి ఎన్నాళ్లక్రితమో అతనిని వివాహమాడి వుందును."

ప్రసాద్:-"మీతండ్రి వుద్దేశ్యం ఎట్లావుంది?"

అరవింద:-"మాతండ్రి వుద్దేశాని కేముంది, నాకే తెలుసు అసంభవమని. అదే చెవుతాడు "అంటరాని వాళ్ళంగా హేయంగాచూచే యీ సంఘంలో అదితగని కోరిక'ని.

......చంద్రబింబం వెండి కరగబోసినట్లు వెన్నెలలను నలువైపులా వెదజల్లుతోంది. ఆ వెన్నెట్లో కబుర్లు చెప్పకొంటూ అరవింద ప్రసాద్ వెనుకనే పోతోంది-

*　　*　　*

ప్లాట్‌ఫారం చాల రద్దీగా వుంది. వేసవికాలపు శెలవులకని విద్యాలయాలన్నీ ఆరోజే మూసారు. విద్యార్థులు శలవులకు యిళ్లకుపోతున్నారు.

అరవింద, సీతా, శశీ, ప్లాట్‌ఫారంమీద గన్నేరు చెట్టునీడను నిలబడి జనప్రవాహాన్నంతనీ, దృష్టితో గాలించేస్తున్నారు. సీత ఒక్కసారిగా అంది- అదుగో లైసెన్సుకూలీనివెంబడి పెట్టుకొని వస్తున్నాడు. అరవింద కంగారుగా కళ్లను ఎత్తి దృష్టిని నిగిడ్చింది తొందరలో జనాన్ని తోసుకొంటూ వస్తున్నాడు ప్రసాద్—

బండివచ్చి ఆగింది. అరవింద శశీ తక్కిన యువతులందరూ ఆడవాళ్ల కంపార్టుమెంటులోకి ఎక్కారు. బండి కదలింది. ప్రసాద్ తనకు వీడుకోలు యివ్వటానికివచ్చిన స్నేహితులందరికీ జేబు రుమాలు వూపుతో సౌజ్ఞచేస్తున్నాడు. బండి శరవేగాన్ని పోతోంది. అరవింద కిటికీలోనుంచి ప్రసాద్ వైపు తొంగిచూస్తోంది.

*　　*　　*

వూరు బైటనున్న మాలగూడెం అంటుకొందని కేకలువేస్తూ జనం ఆవైపు పరుగెత్తున్నారు. ప్రసాద్‌కు యీసంగతి తెలిసింది వేగంగా మాలగూడానికి పరుగెత్తాడు. మంటలు మిన్ను ముట్టున్నాయి. పొగలు నలుదెశలా క్రమ్ముకుపోయాయి. బీదకుటుంబాల దీనాలాపాలు ప్రతిధ్వనిస్తున్నాయి. వూరువారంతావచ్చి నిలబడి నివ్వెరబోతూ చూస్తున్నారే కాని ఒక్కరైనా సాహసించి మంటల్ని ఆర్పేటందుకు పోవడంలేదు. సాహసించిన యువకుల్నికూడ పోనివ్వనీయడంలేదు మాలగూడెంలోకిపోతే మైలపడవలసి వస్తుందని. ప్రసాద్ సాహసించి పోతుంటే అనేకమంది ఆపుచేయబోయారు. అరవింద వాక్కులోని నిజం అర్థంఅయింది. "క్రూరసంఘాని కెక్కడిది దయ."

ప్రసాద్ జనంలోనుంచి తోసుకొంటూపోయి మాలంగూడెం లోనికి చొరబడ్డాడు. పిల్లల ఏడ్పులు తల్లుల రంకెలు చెవులు చిల్లులుపడ్తున్నాయి. అరవింద కుండతో నీళ్లుతెచ్చి ప్రసాద్‌కు అందిస్తోంది. మంటలతో పోరుసలుపుతున్నట్లు ఆర్పుతున్నాడు.

ఒక యింట్లో వుయ్యాలతొట్టిలో పసిపిల్లవాడు ఒకడు ఏడుస్తున్నాడు. యిల్లు నాలుగువైపులూ అంటుకుపోయింది. యింటి బైట తల్లి ఏడుస్తోంది. ఎవరూ లోపలికిపోవ యత్నించడంలేదు. కర్రలు కాలి పడుతున్నాయి. ప్రసాద్ సాహసించి లోపలికి పోయాడు. మంటలు అతనిని క్రమింగాయి. బైటవాళ్ళంతా తహతహలు పడుతున్నారు. మంటలోనుంచి ప్రసాద్ చేతులు పసిపాపని బైటకు అందించాయి.

*　　*　　*

అరవిందను లూథరుకిచ్చి వివాహంచేయటానికి నిశ్చయింపబడింది. యీరిగాడూ యీరిగాడు భార్యా, ఆరోజే మతం పుచ్చుకొన్నారు. అరవిందకుకూడ మిక్కిలి వొత్తిడిచేసి మతం యిప్పించారు.

ఆ సాయింత్రం హాస్పటల్ చర్చిలో వివాహం నిశ్చయింపబడింది.

సాయంత్రం మూడు గంటలకు చర్చి గంట మ్రోగింది. యువతీ యువకులు గుంపులు గుంపులుగా చర్చిలోకి పోతున్నారు. బారులు తీర్చిన బల్లలమీద కొందరు కూర్చుంటున్నారు.

అల్లారు ముద్దుగా అమర్చబడిన కుర్చీలమీద పెండ్లి దుస్తులతో ముస్తాబైన అరవిందా లూథర్, వారికి యిరుప్రక్కలా తోడి పెండ్లి కూతురూ పెండ్లికొడుకూ కూర్చున్నారు. ప్రార్థన మొదలుపెట్టగానే అందరూ లేచి నిలుచున్నారు.

ప్రార్థన పూర్తయింది—

పొడుగుపాటి దుస్తులు ధరించిన ఫాదిరీ కళ్ళద్దాలు సవరించుకొంటూ గద్దె ముందు నిలబడి బైబిలు పుస్తకంలోని వాక్యాలు చదువుతున్నాడు. బైబిలు తీసుకొని వధూవరులవద్దకువచ్చి ప్రశ్నించాడు—'అబ్బాయీ! నీ పేరేమి!'

పెండ్లి కొడుకు:—"లూథర్!"

ఫాదిరీ:—"లూథర్, నీవు నీ జన్మాంతమువరకూ యీమెను ధర్మపత్నిగా నిర్ణయించుకొన్నావు కాదూ"

భావిజీవితపు వూహాసదనాలు కట్టున్న లూథర్ సంతోషంగా జవాబిచ్చాడు– "నిశ్చయంగా"

ఫాదరీ:—"యీమె కష్టసుఖములలో సర్వవిధులా పాల్గొనగలనని వాగ్దానం చేయగలవా? "

లూథర్:—"ముమ్మాటికీ"

ఫాదిరీ అరవింద వైపు తిరిగి ప్రశ్నించాడు–"బిడ్డా నీపేరేమి"

అరవింద పరిహాసంగా నవ్వుతూ—"అసలుపేరు ఎంకి!" అంది.

ఫాదిరీ నివ్వెరపోయి—"యీ రిజిష్టర్‌లో నీపేరు అరవింద అనివుందే!" అన్నాడు.

అరవింద ఆ ప్రశ్నకు సమాధానం చెప్పబోయింది కాని, నాలుకలోనికి గుంజటంవల్ల అసాధ్యంఅయింది. సాహసించి తడబడుతున్న గొంతుకతో అంది—"అది నా ప్రేమమూర్తి ముద్దుపేరు.

ఫాదిరీ మరింత ఆశ్చర్యంగా ఆమెముఖం పరీక్షించాడు. విషాద చంద్రికలు అల్లుకుపోతున్న ఆవికృతాకారంచూచి భయభ్రాంతు డయ్యాడు. భయకంపితస్వరంతోనే ప్రశ్నించాడు– "నీ ప్రేమమూర్తి ఎవరుకే..... "

అరవింద:—"అతడా! నా అంధకార జీవితానికి దివిటీని వెలిగించి సౌఖ్యజీవితానికి దారిచూపిన ప్రేమమూర్తి. కాని క్రూర సంఘం ఆ దివిటీని ఆర్పి, నన్నీ కూపంలో నెట్టింది– అతడా! నా యీ విజ్ఞాన జీవితానికి కారకుడు—లేకుంటే నే నీపాటికి ఏ పొలాలగట్లమీదనో గడ్డికోసుకొంటూ వుండవలసినదాని నేకాదూ? అతడే నా ప్రేమమూర్తి—అతనినే నా పవిత్రహృదయం ఆహ్వానించి– నేటివరకు స్వాగతగీతాలు పాడుతోంది.........చిన్ననాడు...చిన్నప్పటినుంచీ నాకు విద్యనునేర్పి, వున్నత విద్యకు ఆర్ష నేజిలో జేర్పించి సర్వవిధాలా నావ్యర్థజీవితానికి ఆయువుపోసింది ఆప్రేమమూర్తి!......

ప్రక్కగా జనసమూహంలో కూర్చున్న యీరిగాడు లేచి ఫాదిరీకి సైగచేసాడు.

ఫాదిరీ వధూవరులను అల్టారుమీదికి తీసుకపోయాడు.

అరవింద ఎలుగెత్తి ఏదో చెప్పబోయింది కాని నిస్పృహ ఆయాసం ఆమెను అవరించుకుపోయాయి.

అరవింద వొక్కసారిగా అల్టారుమీద కూలిపోయింది. జనమంతా అల్టారువద్ద గుమిగూడారు. గగ్గోలు రేకెత్తింది ఆచర్చిలో.

గుంపులోనుంచి ఎవరో కేకేవేసారు– 'అరవింద ఆత్మహత్య చేసుకొంది'—అని

ఇంకోవైపు నుంచి ఎవరో అరిచారు—'యింతకుముందే విషంత్రాగి వచ్చింది' అని

